# కూనంనేని గెలుపునకు కృషి చేయాలి..

## సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతీనేని సుదర్శన్





కొత్తగూడెం, నవంబర్ 15(కెరటం ప్రతినిధి)

కొత్తగూడెం నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి కూనంనేనీ సాంబశివరావు గెలుపుకు సీపీఎం కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతీనేని సుదర్శన్ అన్నారు. స్థానిక మంచిగంటి భవన్లో నియోజకవర్గ కన్వీనర్ కాసాని ఐలయ్య అధ్యక్షతన జరిగిన జనరల్ బాడి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కొత్తగూడెం లో రాజకీయ టూరిస్ట్ జలగం వెంకటరావు, అవకాశవాది వనమా వెంకేశ్వరరావు ను ఓడించి ప్రజాస్వామిక వాది కూనంనేని సాంబశివరావు ను గెలిపించాలని పిలుపునిచ్చారు. వామపక్షాల అభ్యర్థులు అసెంబ్లీలో ఉంటే ప్రజా సమస్యలపై పోరాడుతా రని, ప్రజాస్వామ్య రక్షణకై నిలబడతారు అని అన్నారు. కమ్యూనిస్టులు లేని అసెంబ్లీ లో ప్రజా సమస్యలు వెలుగులోకి రావని, ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులను గెలిపిస్తే ప్రజా గొంతుకగా పని చేస్తారని అన్నారు.

**ప్రశ్నించే శక్తులను అసెంబ్లీకి పంపించండి : సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి కూనంనేని సాంబశివరావు**

ప్రశ్నించే శక్తులను అసెంబ్లీకి పంపించాలని సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం నియోజక వర్గ అభివృద్ధికి వామపక్ష శక్తులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అవకాశవాద రాజకీయాలను ఓడించి స్వచ్ఛ రాజకీయాలను గెలిపించాలని పిలుపునిచ్చారు. కొత్తగూడెం సీపీఐ తప్పక గెలుస్తుందని, అందుకు కమ్యూనిస్టుల సాగించిన పోరాటాలే నిదర్శనం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, కొక్కెరపాటి పుల్లయ్య, ఎం జ్యోతి, నర్సారెడ్డి, లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, కొండపల్లి శ్రీధర్, దోడ్డా రవి, వీర్ల రమేష్, యు నాగేశ్వరరావు, మందా నరసింహా రావు, యం వి అప్పారావు, నగేష్, వీరన్న లక్ష్మి ఇందిరా తదితరులు పాల్గొన్నారు.






## బీఆర్ఎస్ గూటికి దండు సారయ్య

### కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి కేటీఆర్..

ఇల్లందు,నవంబర్15(కెరటం ప్రతినిధి)

మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ నాయకుడు,తెలంగాణ ముదిరాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, శివశక్తి రాష్ట్ర నాయకులు దండు సారయ్య బుధవారం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్లో పురపా లక శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్లో చేరారు. అనం తరం కేటీఆర్ మాట్లాడుతూ.. ముదిరాజ్,శివశక్తి నాయకులకు రాష్ట్రంలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అదేవిధంగా వారికి రానున్న రోజుల్లో అన్ని విధాలుగా తగిన న్యాయం చేస్తామన్నారు. రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రాబోతుందని స్థానిక ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు.



## పార్టీ నిర్ణయం మేరకే ఎన్నికల్లో ముందుకెళ్తాం

- ఎమ్మెల్యే హరిప్రియ ఓటమి కొరకు నూరు శాతం కృషి చేస్తాం..
- టిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ..

ఇల్లందు,నవంబర్ 15(కెరటం ప్రతినిధి)

తెలుగుదేశం రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకే ఈ ఎన్నికల్లో పనిచేస్తామని టిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ పేర్కొన్నారు.బుధవారం పట్టణంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తు పార్టీ ప్రణాళికపై సమావేశం నిర్వహించామని, తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పోటీ చేయడం లేదని రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకే ఏ పార్టీతో కలిసి పని చేయాలన్నది రెండు రోజుల్లో ప్రకటిస్తుందని తెలిపారు. 2018 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుతో ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ ఇల్లందు నియోజకవర్గానికి ఏమి చేశారని ప్రశ్నించారు.ఎమ్మెల్యే భర్త హరిసింగ్ నాయక్ తనకు సహకరించిన,సహకరించని వారిని బెదిరిస్తూ రౌడీ రాజకీయాలు చేశాడే తప్ప ఏటువంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. ఈ మేరకు ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ ఓటమి కొరకు నూరు శాతం కృషి చేస్తామని అన్నారు. సమావేశంలో అన్ని మండలాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## అపోలో రేడియాలజీ ఇంటర్నేషనల్ లో రేడియాలజీ శిక్షణ

హైదరాబాద్, నవంబర్ 15(కెరటం ప్రతినిధి)

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అపోలో రేడియాలజీ ఇంటర్నేషనల్ లో రేడియాలజీ శిక్షణ అందించడమే లక్ష్యమని అపోలో రేడియాలజీ ఇంటర్నేషనల్ సీఈవో, ఎండీ డాక్టర్ శ్రీనివాస రాజు కలిదిండి తెలిపారు. ఈ మేరకు బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపోలో రేడియాలజీ ఇంటర్నేషనల్ (ఏఆర్ఐ) భారతదేశంలో రేడియాలజీ ల్యాండ్స్కేప్ను మార్చే దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఈ రంగంలో శిక్షణ, నైపుణ్యంలో ఉన్న అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. అంతర్జాతీయ అధ్యాపకులతో ప్రపంచ స్థాయి రేడియాలజీ విద్యను సరసమైన ధరకు భారతీయ రేడియాలజిస్టుల ఇంటి వద్దకు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. భారతదేశంలో రేడియాలజీ శిక్షణను అభివృద్ధి చేయడంలో మా నిబద్ధత తిరుగులేనిదన్నారు. రేడియాలజిస్ట్ల నైపుణ్యాన్ని పెంచడమే కాకుండా రోగి సంరక్షణపై దీని ప్రభావం ఉంటుందన్నారు.